సాక్షి మహబూబాబాద్

సోమవారం | 2 | జూన్ | 2025



అధిక సాంద్రత సాగు.. లాభాలు బాగు - 8లో ▸

అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి అధిక దిగుబడి సాధించవచ్చని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త నాగభూషణం తెలిపారు.



పశువుల ఎరువుతో భూసారం

దుక్కులు దున్నడానికి ముందు పంట భూముల్లో పశువుల ఎరువు వేసి దున్నితే అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు తెలుపుతున్నారు. - 8లో ▸

గరిష్టం/కనిష్టం $38.1^0/24.7^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం కాస్త ఎండ తీవ్రత ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వీరన్న సన్నిధిలో భక్తుల సందడి



కురవి: వేసవి సెలవులు.. ఆదివారం కావడంతో మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్ర స్వామి ఆలయంలో భక్తులతో సందడి నెలకొంది. స్వామి, అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలో నిలుచున్నారు. దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. భక్తులతో ఆలయం కిక్కిరిసిపోగా ఆలయ అధికారులు కావాల్సిన సౌకర్యాలు కల్పించారు.

జాతీయ సదస్సుకు ఎంపిక



మహబూబాబాద్ అర్బన్: ఈ నెల 26, 27తేదీల్లో న్యూఢిల్లీలో జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి (ఎన్‌సీఈఆర్టీ) నిర్వహించనున్న సదస్సుకు భౌతిక రసాయనశాస్త్ర ఉపాధ్యాయుడు వి.గురునాథరావు రూపొందించిన పరిశోధన ప్రాజెక్ట్ ఎంపికైంది. గురునాథరావు రూపొందించిన ప్రాజెక్టు 'హ్యాండ్స్ ఆన్ ఫిజిక్స్'ను సదస్సులో ప్రదర్శిస్తారు. కాగా రాష్ట్రం నుంచి గురునాథరావు మూడోసారి ప్రదర్శనకు ఎంపికయ్యారు. 2018, 2022లో ఎన్‌సీఈఆర్టీ సదస్సుల్లో అవార్డులు అందుకున్నారు. ఆయన ఎంపికపై విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మేడారంలో విత్తన పండుగ



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారంలో పూజారులు విత్తన పండుగ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. సమ్మక్క పూజారులు, స్థానిక ఆదివాసీలు గ్రామంలోని గ్రామ దేవతలను పసుపు, కుంకుమలతో అలకరించి కంకణాలు కట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పులతో పూజారుల కుటుంబీకులు, గ్రామస్తులు వన భోజనలకు వెళ్లారు. వనంలో కొత్త పందిరి వేసి పసుపు, కుంకుమలు, సార ఆరగించి ప్రకృతి దేవతలకు పూజలు చేశారు. ఈ సందర్భంగా పూజారులు, ఆదివాసీ పెద్దలు విత్తనాలు నాటేందుకు ముందుగా వర్షాలు ఏ కార్తెలో బాగా కురుస్తాయని కొత్త మట్టి కుండలో నీటిని పోసి ఒక్కొక్క కార్తె పేరు చెబుతూ ఇప్పపూలను వదులుతారు. నీటిలో ఇప్పపువ్వు తేలితే వర్షాలు అనుకూలంగా కురుస్తాయని ఆదివాసీలు తెలిపారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయంగా విత్తన పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని పూజారులు తెలిపారు. అనంతరం వనంలో చెట్ల కింద విడిది చేసి వంటావార్పు చేసుకుని సహపంక్తి భోజనలు చేశారు. విత్తన పండుగతో మేడారంలో పండుగ వాతావరణం కనిపించింది. ఈ కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, పూజారులు సిద్ధబోయిన మునీందర్, కొక్కెర కృష్ణయ్య, మహేశ్, భోజరావు, సిద్ధబోయిన రమేశ్, సిద్ధబోయిన స్వామి, వసంతరావు, దశరథం, గ్రామస్తులు పాల్గొన్నారు.

డొనేషన్ల వసూలుపై చర్య తీసుకోవాలి



కేయూ క్యాంపస్: హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో ముందస్తు అడ్మిషన్లు కల్పిస్తూ డొనేషన్లు వసూలు చేస్తున్నారని, సదరు కాలేజీపై వెంటనే చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి వెంకటరెడ్డి కోరారు. ఈమేరకు ఆదివారం కాకతీయ యూనివర్సిటీలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్ ఇ.పురుషోత్తంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలకు విరుద్ధంగా ముందస్తు అడ్మిషన్లు ఇవ్వడం సరికాదని సంబంధిత కళాశాలపై చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్, బాధ్యులు శంకర్ పాల్గొన్నారు.

శాతవాహన ఎక్స్‌ప్రెస్ నిలుపుదల చేయాలి

గార్ల: గార్ల రైల్వేస్టేషన్‌లో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు నిలుపుదల చేయాలని కోరుతూ ఆదివారం యూనియన్ మినిస్టర్ ఆఫ్ స్టేట్ రైల్వేస్ సోమన్నకు రైల్వే డీఆర్‌యూసీసీ మెంబర్ జర్పుల లచ్చిరాంనాయక్ వినతిపత్రం అందజేశారు. అనంతరం సోమన్నను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

వన మహోత్సవానికి వేళాయె..

- నర్సరీల్లో సిద్ధంగా మొక్కలు
- ఆశించిన స్థాయిలో వర్షాలు పడగానే నాటుడే..
- జిల్లాలో 50లక్షల మొక్కల లక్ష్యం
- శాఖల వారీగా కేటాయింపునకు కసరత్తు
- లక్ష్యాలు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశాలు



మానుకోట మున్సిపల్ పరిధిలోని నర్సరీలో మొక్కలు

మహబూబాబాద్: ప్రతీ సంవత్సరం వానాకాలం ప్రారంభంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమం చేపడుతోంది. వానలను దృష్టిలో పెట్టుకుని శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. ఈమేరకు శాఖల వారీగా లక్ష్యాల కేటాయింపులో అధికారులు నిమగ్నమయ్యారు. నర్సరీల్లో అందుబాటులో ఉన్న మొక్కలను దృష్టిలో పెట్టుకుని జిల్లాలో 50 లక్షల మొక్కలు నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆశించిన స్థాయిలో వర్షాలు పడగానే మొక్కలు నాటేందుకు సిద్ధమవుతున్నారు.

జిల్లాలో 5 మున్సిపాలిటీలు..

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. కాగా మానుకోట మున్సిపాలిటీ పరిధి గాంధీపురంలో రెండు నర్సరీలు, కురవి రోడ్డులో నర్సరీ, రామచంద్రాపురంలో నర్సరీ ఉండగా.. కేవలం కురవి రోడ్డులో ఉన్న నర్సరీలో 60,000 మొక్కలు ఉన్నాయి. మున్సిపాలిటీలో 30,000 మొక్కలు మాత్రమే నాటడం లక్ష్యం కాగా.. ఇంకా 30,000 అదనంగా ఉన్నాయని సిబ్బంది తెలిపారు.

- మరిపెడ మున్సిపాలిటీ పరిధిలో రెండు నర్సరీలు ఉండగా మొక్కలు లేవు. అయితే గ్రీన్ టీం లేకపోవడంతో మొక్కల పెంపకం చేపట్టలేదని సిబ్బంది పేర్కొన్నారు.
- తొర్రూరు మున్సిపాలిటీ పరిధిలో రెండు నర్సరీలు ఉండగా గ్రీన్ టీం లేక మొక్కలు పెంచలేదు.
- డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో రెండు నర్సరీలు ఉండగా ఒక నర్సరీలో మాత్రమే 42,000 మొక్కలు ఉన్నాయి. కౌన్సిల్ పదవి కాలం ముగియడంతో గ్రీన్ సభ్యులను తొలగించారు. నిర్వహణ బాధ్యత సిబ్బందికి అప్పగించారు.
- ఇటీవల కేసముద్రం మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ అయ్యింది. దాని పరిధిలో ఐదు గ్రామాలు ఉండగా ప్రతీ జీపీలో నర్సరీ ఉండగా.. వాటిలో మొత్తం 42,000 మొక్కలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ప్రతీ మున్సిపాలిటీ 30,000 మొక్కలు నాటాలని లక్ష్యం కాగా.. మొక్కలు లేని మున్సిపాలిటీలకు అటవీశాఖ ద్వారా సరఫరా చేయనున్నారు.

జిల్లాలో 482 జీపీలు.. 482 నర్సరీలు

జిల్లాలో 18 మండలాలు ఉండగా 482 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతీ గ్రామపంచాయతీ పరిధిలో ఒక నర్సరీ ఉంది. ప్రతీ నర్సరీలో 8,000నుంచి 10,000 మొక్కలు ఉన్నాయని పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు. ఆ నర్సరీల్లో ఉన్న మొక్కలు గ్రామాల్లో సరిపోతాయని, ఇంటికి ఆరు మొక్కలు పంపిణీ చేస్తారు. మిగిలినవి రోడ్ల పక్కన, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణలో నాటనున్నారు. అలాగే అవెన్యూ ప్లాంటేషన్, ప్రకృతి వనాల్లో నాటనున్నారు.



50 లక్షల మొక్కలు నాటే లక్ష్యం..

కలెక్టర్ కార్యాలయంలోని ప్రధాన సమావేశ మందిరంలో మే 31న కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అదనపు కలెక్టర్లు లెనిన్ వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మచారి, డీఎఫ్ఓ విశాల్, ఆర్డీఓలు కృష్ణవేణి, గణేశ్‌తో కలిసి సంబంధిత అధికారులతో వన మహోత్సవంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 50,13,500 మొక్కలు నాటే లక్ష్యం ఉందన్నారు. శాఖల వారీగా లక్ష్యాలను కేటాయించి, పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాలతో సంబంధిత అధికారులు తగు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు



జాతీయ జెండాలతో అలంకరించిన కలెక్టరేట్

- కలెక్టరేట్‌లో ఏర్పాట్లు పూర్తి
- విద్యుత్ దీపాలతో కార్యాలయం అలంకరణ
- ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్

మహబూబాబాద్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కలెక్టరేట్‌లో అన్ని ఏర్పాట్లు చేశారు. వేదికతో పాటు విలేకరులు, ప్రజాప్రతినిధులు, అధికారులకు ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు. అలాగే కలెక్టర్ కార్యాలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 8.30గంటలకు జిల్లా కేంద్రంలోని అమర వీరుల స్తూపం వద్ద ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్, ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పిస్తారు. అక్కడి నుంచి 8.45గంటల వరకు కలెక్టరేట్‌కు చేరుకుంటారు. 8.55గంటలకు ప్రభుత్వ విప్, కలెక్టర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. 9గంటలకు ప్రభుత్వ విప్ జాతీయ జెండా ఆవిష్కరిస్తారు. 9.05 గంటలకు జాతీయ గీతాలాపన, 9.10 గంటలకు విప్ ప్రసంగిస్తారు. 9.30 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 9.45గంటలకు రైతులకు నాణ్యమైన విత్తనాల పంపిణీ కార్యక్రమం, 9.50గంటలకు జిల్లాలో పదో తరగతి టాపర్స్‌కు సన్మానం కార్యక్రమం ఉంటుంది. ఉదయం 10గంటల వరకు కార్యక్రమాలు ముగుస్తాయని కలెక్టరేట్ అధికారులు తెలిపారు.

నేడు 'నాణ్యమైన విత్తనం- రైతన్నకు నేస్తం' ప్రారంభం

మహబూబాబాద్ రూరల్ : ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పంటల సాగులో నాణ్యమైన విత్తనం పాత్రను గుర్తించి చేపట్టిన 'నాణ్యమైన విత్తనం-రైతన్నకు నేస్తం' కార్యక్రమం సోమవారం ప్రారంభించనున్నట్లు మల్యాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త ఎస్.మాలతి, జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, ఇతర గౌరవ అతిథుల చేతుల మీదుగా కార్యక్రమం ప్రారంభం అవుతుందని చెప్పారు.

విద్యార్థుల నమోదు పెంచాలి

- ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



బడిబాట ప్రచార జాతాను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్

మహబూబాబాద్ అర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని మానుకోట ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం టీఎస్‌యూటీఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచార జాతాను ఎమ్మెల్యే జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బడి మనదే-బడి బాధ్యత మనదే అనే నినాదంతో ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో పాటు నూతనంగా నియామకాలు చేపట్టి, టీచర్ల కొరత లేకుండా చేశామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు మల్లారెడ్డి, మురళీకృష్ణ, యాకూబ్, స్వప్న, మంజుల, సంజీవ, కుమార్, రాజశేఖర్, ప్రవీణ్, శ్రీనివాస్, వీరస్వామి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి 'భూ భారతి'

- తొర్రూరు ఆర్డీఓ గణేశ్‌బాబు




సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ గణేశ్‌బాబు

మరిపెడ: గ్రామాల్లో భూ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని రూపొందించిందని తొర్రూరు ఆర్డీఓ గణేశ్‌బాబు అన్నారు. మరిపెడ మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం డివిజన్ స్థాయి రెవెన్యూ సిబ్బంది అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆర్డీఓ హాజరై మాట్లాడుతూ.. భూ భారతి చట్టంపై సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 3నుంచి గ్రామాల్లో రెవెన్యూ అవగాహన సదస్సులు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉదమం 9 గంటల సాయంత్రం 4 గంటల వరకు ఆయా ఉమ్మడి గ్రామాల పంచాయతీ కార్యాలయాల్లో సదస్సులు నిర్వహించన్నుట్లు తెలిపారు. రైతులు భూ సమస్యలు ఉంటే సంబంధిత ఫారం నింపి అధికారులకు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో మరిపెడ, చిన్నగూడూరు, నర్సింహులపేట మండలాల తహసీల్దార్లు కృష్ణవేణి, మహబూబ్ అలీ, రమేశ్‌బాబు, మరిపెడ ఆర్ఐ శరత్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సేవా పతకాలకు ఎంపిక

మహబూబాబాద్ రూరల్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జిల్లా పరిధిలో పనిచేస్తున్న పలువురు పోలీసు అధికారులు, సిబ్బందిని సేవా పతకాలకు ఎంపిక చేశారు. హోంశాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్త ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తమ సేవా పతకాలకు ఎంపిక అయిన వారిలో డి.నాగేశ్వరరావు (ఎస్సై, మహబూబాబాద్ టౌన్), బి.కోటేశ్వరరావు (ఏఎస్సై, డోర్నకల్ పీఎస్), ఎం.హనుమంతు (ఏఎస్సై, మరిపెడ పీఎస్),మహమ్మద్ రహమత్ అలీ (ఏఎస్సై, మహబూబాబాద్ రూరల్ పీఎస్), బి.వీరన్న (ఏఎస్సై, డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, మహబూబాబాద్), జి.యాకయ్య (ఏఎస్సై, నెల్లికుదురు పీఎస్), బి.రమేశ్ (ఏఎస్సై, డిస్ట్రిక్ట్ స్పెషల్ బ్రాంచ్, మహబూబాబాద్), ఎండి.జాకీర్ (ఏఎస్సై,మహబూబాబాద్‌రూరల్ పీఎస్), ఎస్.మహేందర్ (ఏఎస్సై, వర్టికల్స్ మరిపెడ పీఎస్), బి.తులసియా (హెడ్ కానిస్టేబుల్, డీపీఓ, మహబూబాబాద్), జి.రమేశ్ బాబు (హెడ్‌కానిస్టేబుల్, డిస్టిక్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్, మహబూబాబాద్), జి.శాంసన్, (హెడ్ కానిస్టేబల్,సీరోలు పీఎస్), మహమ్మద్ మౌలాబేగ్ (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్, మహబూబాబాద్), కోట శ్రీనివాస్ (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్, మహబూబాబాద్), బి.యాక్య (ఏఆర్ హెడ్ కానిస్టేబుల్, డిస్ట్రిక్ట్ ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ మహబూబాబాద్) ఉన్నారు.

జీలుగ విత్తనాలు స్వాధీనం



పట్టుబడిన వాహనాలతో పాటు జీలుగ విత్తనాలను చూపుతున్న ఎస్పీ

తొర్రూరు: అక్రమంగా నిల్వ ఉన్న జీలుగ విత్తన బస్తాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం డివిజన్ కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన సమావేశంలో ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ వివరాలు వెల్లడించారు. తొర్రూరు పట్టణానికి చెందిన చదలవాడ ఉపేందర్ అక్రమంగా జీలుగ పచ్చిరొట్ట విత్తనాలను సేకరించి బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నాడు. జనగామ జిల్లా తరిగొప్పుల, బచ్చన్నపేట రైతు సేవా కేంద్రాల ఏజెంట్లు శ్రీనివాస్ రెడ్డి, సురేశ్ నుంచి క్వింటాకు రూ.8వేలు చెల్లించి 106 బస్తాల్లో రూ.4.50లక్షల విలువైన 63 క్వింటాళ్ల జీలుగ విత్తనాలను కొనుగోలు చేశాడు. ఆ విత్తనాలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పల్నాడు జిల్లా నర్సారావుపేటకు చెందిన వ్యాపారి శేషాద్రికి క్వింటాకు రూ.12 వేల చొప్పున విక్రయించేందుకు సిద్ధమయ్యాడు. ఈమేరకు తొర్రూరులోని తన ఇంట్లో అక్రమంగా నిల్వ చేయగా.. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు సోదాలు జరిపి బస్తాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితుడు ఉపేందర్‌తో పాటు రైతుసేవా కేంద్రాల ఏజెంట్లు శ్రీనివాస్‌రెడ్డి, సురేశ్, డ్రైవర్లు భూక్య వీరన్న, బానోతు సురేశ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. జీలుగ విత్తనాలతో పాటు రెండు వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

జోరుగా బెల్లం దందా..

- యథేచ్ఛగా బెల్లం సరఫరా, క్రయవిక్రయాలు
- ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి
- అధికారుల సహకారంపై అనుమానాలు



ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న నల్లబెల్లం (ఫైల్)

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో నల్లబెల్లం దందా జోరుగా సాగుతోంది. గుడుంబా తయారీ, క్రయవిక్రయాలపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపడంతో కొంతకాలం జిల్లాకు నల్లబెల్లం రవాణా నిలిచిపోయింది. అయితే ప్రస్తుతం యథేచ్ఛగా బెల్లం దందా జరుగుతోంది. ఇతర రాష్ట్రాల నుంచి విచ్చలవిడిగా జిల్లాకు రవాణా అవుతోందని, దీనికి పోలీసు, ఎక్సైజ్ అధికారులు సహకరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. వ్యాపారులు ఇచ్చే ముడుపులకు ఆశపడి చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

యథేచ్ఛగా బెల్లం సరఫరా..

అక్రమ సంపాదనకు అలవాటుపడిన జిల్లాకు చెందిన సుమారు పదిమంది వ్యాపారులు అడ్డదారుల్లో బెల్లం సరఫరా చేస్తున్నారు. సిండికేటుగా ఏర్పడి ఎక్సైజ్, పోలీసు అధికారులను మచ్చిక చేసుకుని తండాలకు సరఫరా చేస్తున్నారనే ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు, చిత్తూరు నుంచి నల్లగొండ జిల్లా నుంచి మరిపెడ మీదుగా మహబూబాబాద్ జిల్లాకు సరఫరా చేస్తున్నారు. బెల్లం వ్యాపారమంతా జిల్లాలోని మండలాల శివారు గ్రామాలు, తండాల్లో జరుగుతోంది. దీంతో ఆయా ప్రాంతాల పరిధి తమదికాదంటే తమదికాదంటూ సాకులు చెబుతూ ఎక్సైజ్, పోలీసు అధికారులు దాటవేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ వ్యాపారం వారి కనుసన్నల్లోనే కొనసాగుతోందని విశ్వసనీయ సమాచారం.

అక్కడ ధర తక్కువ.. ఇక్కడ ఎక్కువ

వ్యాపారులు మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నల్లబెల్లం తక్కువ ధరకు కొనుగోలు చేసి జిల్లాకు తీసుకువచ్చి అధిక ధరలకు విక్రయిస్తున్నారు. లారీలు, డీసీఎం, ఇతర వాహనాల ద్వారా తెప్పించి టన్నులకొద్దీ క్రయవిక్రయాలు జరిపి కోట్లాది రూపాయల వ్యాపారం కొనసాగిస్తున్నారు. మహారాష్ట్రలో క్వింటా నల్లబెల్లం ధర రూ.5 వేలు ఉండగా ఇక్కడ ధర రూ.9 వేల నుంచి రూ.10 వేలకుపైగా పలుకుతోంది. కాగా నల్లబెల్లంతో తండాల్లో గుడుంబా తయారీ చేసి అమాయక ప్రజల ప్రాణాలను తీస్తున్నారు. కాగా ఎక్సైజ్, పోలీస్ అధికారులు నల్లబెల్లం రవాణాను కట్టడి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా ఉంది. జిల్లాకు ప్రతీరోజు రెండు నుంచి మూడు లారీల నల్లబెల్లం వస్తుంది. వ్యాపారులు అధికారుల కళ్లుకప్పి వారికి అనువైన ప్రాంతాల్లో డంపు చేసి అక్కడి నుంచి ఆటోలు, ద్విచక్రవాహనాల ద్వారా తండాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.

తనిఖీలు అంతంత మాత్రమే..

జిల్లాలో అధికారులు కొంతమేరకు బెల్లం పట్టుకుని కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారని తెలుస్తోంది. దీంతో బడా బెల్లం వ్యాపారులు తమ వ్యాపారాన్ని ఇష్టమొచ్చినట్లు సాగిస్తున్నారు. రైళ్లు, ఇతర వాహనాల ద్వారా తక్కువ మొత్తంలో బెల్లం తీసుకువచ్చే వ్యాపారులు మాత్రమే అధికారులకు పట్టుబడుతుండగా..పెద్ద మొత్తంలో రవాణా చేసే వారిని పట్టుకున్న దాఖలాలు లేవు.

నమోదు చేసిన కేసులు..

జిల్లాలో ఎక్సైజ్ అధికారులు 15,605 కిలోల నల్లబెల్లం, 1,258కిలోల పటిక, 3,442 లీటర్ల గుడుంబా స్వాధీనం చేకున్నారు.అలాగే 161 వాహనాలను సీజ్ చేసి, 553 కేసులు నమోదు చేసి, 225 మందిని అరెస్టు చేశారు. 2022లో ఏడుగురిపై, 2023లో ఏడుగురిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేయగా, మరో 8 మందిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. అలాగే పోలీస్ అధికారులు 38,940 కిలోల నల్లబెల్లం, 2,251 పటిక స్వాధీనం చేసుకుని, 27 వాహనాలు సీజ్ చేసి, 47 కేసులు నమోదు చేసి 98 మందిని అరెస్టు చేశారు.

అక్రమార్కులను ఉపేక్షించేది లేదు..



జిల్లాలో ఎక్కడ కూడా నల్లబెల్లం, ఇతర అక్రమ వ్యాపారాలు నిర్వహించే వారిని ఉపేక్షించేది లేదు. అక్రమ వ్యాపారాలపై నిఘా పెట్టి పోలీసు అధికారులు, సిబ్బంది, టాస్క్ ఫోర్స్, ప్రత్యేక బృందాలతో రైళ్లు, వాహనాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నాం. గ్రామాలు, తండాల్లో నల్లబెల్లం, గుడుంబా రవాణా, క్రయవిక్రయాలపై ప్రజలు కూడా తమ వంతు సహకారం అందించి సమాచారం ఇస్తే ఒక్క కిలో కూడా వదిలిపెట్టకుండా కేసులు నమోదు చేస్తాం.

- సుధీర్ రాంనాథ్ కేకన్, ఎస్పీ

నల్లబెల్లం కట్టడికి ప్రత్యేక చర్యలు



జిల్లాలో ఇప్పటివరకు నల్లబెల్లం క్రయవిక్రయాలు, గుడుంబా తయారీపై ఉక్కుపాదం మోపి కట్టడి చేస్తున్నాం. 14 మందిపై పీడీ యాక్టు కేసులు నమోదు చేసి 5వేల మందిని బైండోవర్ చేశాం. బైండోవర్ ఉల్లంఘించిన వారితో జరిమానాలు కట్టించాం. నల్లబెల్లం అక్రమ రవాణాపై ఎక్సైజ్, డీటీఎఫ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, సిబ్బంది ప్రతీరోజు దాడులు నిర్వహిస్తున్నారు. రైళ్లలో, యాత్ర రవాణా మార్గాల్లో ప్రత్యేక బృందాలు తనిఖీలు చేస్తున్నాయి.

- బి.కిరణ్, డీపీఈఓ

ఛత్తీస్‌గఢ్ టు హైదరాబాద్



ఐరన్ ఓర్‌తో వెళ్తున్న లారీ

ఏటూరునాగారం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ నుంచి ఐరన్ ఓర్ పెద్ద ఎత్తున హైదరాబాద్‌కు తరలిపోతోంది. ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి సమీపంలో చెక్‌పోస్టు వద్ద పోలీసులు వాహనాలను ఆదివారం తనిఖీ చేశారు. ఐరన్ ఓర్ ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్తుందని, పర్మిషన్ ఉందా లేదా అంటూ ఆరా తీశారు. అయితే డ్రైవర్ సెల్‌ఫోన్‌లో చూపిన ఆధారాలను చూసి విచారించి వదిలేశారు. గతంలోనే మావోయిస్టులు పలు ప్రకటనల్లో ఖనిజ సంపద తరలిపోయే అవకాశాలు ఉన్నాయని ప్రకటించారు. కొద్ది రోజులకే ఛత్తీస్‌గఢ్ నుంచి పెద్ద ఎత్తున ఐరన్ ఓర్ తరలిపోతుండడం గమనార్హం. ఖనిజ సంపదను తరలించేందుకే మావోయిస్టుల ఏరివేతకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందా అనే అనుమానాలను పలు ప్రజా సంఘాల నాయకులు వ్యక్తం చేస్తున్నారు.


జవాన్‌కు ఘన స్వాగతం



మహేశ్‌కు స్వాగతం పలికిన మిత్రులు, పోలీసులు

మహబూబాబాద్ రూరల్: ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్న తర్వాత మొదటిసారిగా జిల్లా కేంద్రానికి వచ్చిన వీర జవాన్ రొట్టెల మహేశ్‌కు స్థానిక రైల్వే స్టేషన్‌లో ఆదివారం తెల్లవారుజామున అతడి మిత్రులు, పోలీసులు అపూర్వ స్వాగతం పలికారు. చిన్నగూడూరు మండలం జయ్యారం గ్రామానికి చెందిన రొట్టెల మహేశ్ ఆపరేషన్ సిందూర్‌లోపాల్గొని స్వస్థలానికి వెళ్లేందుకు వచ్చారు. స్వాగతం పలికిన వారిలో టౌన్ క్రైం ఎస్సై వెంకటేశ్వర్లు, ప్రముఖ న్యాయవాది కాసాని మౌనిక, ఉప్పుల మహేశ్, తుప్పతి వినోద్ కుమార్, తుప్పతి విజయ్ కుమార్, పీసీలు రహీం, అనిల్, నరేంద్ర వర్మ తదితరులు ఉన్నారు.

గుండెపోటుతో ఏఎస్సై కృష్ణమూర్తి మృతి



ఏఎస్సై కృష్ణ మూర్తి(ఫైల్)

కేసముద్రం: కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై మద్దెర్ల కృష్ణమూర్తి(58) గుండెపోటుతో మృతి చెందిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. ఎస్సై మురళీధర్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం.. కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సై కృష్ణమూర్తి మూడేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. రోజు మాదిరిగానే ఉదయం విధులకు హాజరయ్యాడు. కాగా సాయంత్రం 7.30 గంటలకు గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. వెంటనే అప్రమత్తమైన తోటి సిబ్బంది సీపీఆర్ చేసి.. 108వాహనంలో మహబూబాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే మార్గమధ్యంలో ఆయన మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మహబూబాబాద్ పట్టణానికి చెందిన క్రిష్ణమూర్తి ప్రస్తుతం హనుమకొండలోని వడ్డేపల్లి టీచర్స్ కాలనీలో కుటుంబంతో నివాసం ఉంటున్నాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కాగా విధి నిర్వహణలో విశిష్ట సేవలు అందించినందుకు ఏఎస్సై కృష్ణమూర్తి ఇటీవల రాష్ట్ర పోలీస్‌శాఖ నుంచి ఉత్కృష్ట పతకం అందుకున్నాడు. మరికొద్ది నెలల్లో ఆయన రిటైర్మెంట్ ఉంది. కాగా, ఏఎస్సై కృష్ణమూర్తి మృతితో కేసముద్రంలో విషాదం నెలకొంది.

పాముకాటుతో రైతు మృతి


ఎల్లయ్య (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: పాము కాటుతో ఓ రైతు మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని విశ్వనాథపురంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గుర్రపు ఎల్లయ్య(54) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం తన వ్యవసాయ బావి వద్ద పశువులకు మేత వేస్తుండగా పాము కాటు వేసింది. గమనించని ఎల్లయ్య యథావిధిగా ఇంటికి వచ్చాడు. కాలుకు కాటువేసిన చోట స్వల్పంగా రక్తస్రావం అవుతుండగా కట్టె గీసుకుందని భావించాడు. అనంతరం కాస్త నలతగా ఉండటంతో పాము కాటు వేసి ఉంటుందని భావించిన కుటుంబ సభ్యులు ఎల్లయ్యను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం తరలించగా అదేరోజు రాత్రి మృతిచెందాడు.

విద్యుత్ తీగలే యమ పాశాలై..

- తెగిపడిన తీగలు తగిలి వ్యక్తి మృతి
- చెర్లపాలెంలో ఘటన

తొర్రూరు రూరల్ : విద్యుత్ తీగలు యమపాశాలయ్యాయి. రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగలు తగిలి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన తొర్రూరు మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. పెద్దవంగర మండలం చిన్నవంగర గ్రామానికి చెందిన వల్లపు అశోక్ (45) శనివారం జలగం మల్లయ్యతో కలిసి పని నిమిత్తం బైక్‌పై చెర్లపాలెం వెళ్తున్నారు. ఈ క్రమంలో చెర్లపాలెం శివారులో 11 కేవీ విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడి ఉన్నాయి. చూడకుండా బైక్ నడపడంతో తీగలు వాహనానికి తగిలి కింద పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు తొర్రూరులో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం వరంగల్ ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ అశోక్ అదేరోజు రాత్రి మృతి చెందారు. మృతుడికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి తండ్రి కొమురయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ..

- రూ.14లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారం అపహరణ

ఖిలా వరంగల్ : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి వరంగల్ గాంధీనగర్‌లోని వెంకటేశ్వర కాలనీలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కాలనీకి చెందిన చాతరాజు రేణుక ఇంటికి తాళం వేసి శనివారం కక్కిరాలపల్లిలో జరిగిన ఓ ఫంక్షన్‌కు హాజరయ్యారు. ఆదివారం ఉదయం ఇంటికి రాగా ఇంటి తాళం తీసి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం ఇచ్చింది. దీంతో ఎస్సై సురేశ్ క్లూస్ టీమ్‌తో కలిసి హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరు పరిశీలించారు. బీరువాలో దాచిపెట్టిన ఐదు న్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.14లక్షల నగదు చోరీకి గురైందని బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కొత్తవాడలో పదితులాల బంగారం..

రామన్నపేట : వరంగల్ కొత్తవాడలో ఆదివారం సాయంత్రం సక్కుబాయ్ నివాసంలో దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 తులాల వరకు బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. సుక్కబాయి హైదరాబాద్ వెళ్లిన విషయాన్ని గమనించిన దొంగలు ఈ చోరీకి పాల్ప డినట్లు పోలీసులు భావిస్తున్నారు.

పశువుల ఎరువుతో భూసారం

- వేసవి దుక్కులతో మేలు
- అధిక దిగుబడులు సాధించొచ్చు

పెద్దవంగర: వ్యవసాయంలో రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోతుండడంతో నేలలోని పోషక నిల్వల్లో సమతుల్యత లోపించి ఉత్పాదకత తగ్గుతోంది. చీడపీడలు ఆశించడం.. సూక్ష్మ పోషకాల లోపం దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ క్రమంలో ఈ సమస్యలు అధికమించాలంటే సేంద్రియ పద్ధతులు పాటించాలని వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు.

వేసవి దుక్కులు దున్నే ముందు..


ఆవులు, గేదెలు, గొర్రెల ఎరువు పంటల సాగులో ఎంతో ఉపయోగపడుతుంది. సేంద్రియ ఎరువుతో సమానం. దీనిని దుక్కులు దున్నడానికి ముందే పంట భూముల్లో వేసి దున్నితే అద్భుత ఫలితం ఉంటుంది. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించడానికి వీలుంటుంది. దుక్కులు దున్నిన తర్వాత పశువుల పేడ మొత్తం భూమిలోకి వెళ్లి పంట దిగుబడిని పెంచడానికి దోహదపడుతోంది. పంట ఎదుగుదల, మొక్కలు బలంగా ఉండేందుకు పశువులఎరువు ఉపయోగపడుతుంది. గ్రామాల్లో ట్రాక్టర్, ఎడ్లబండ్ల సాయంతో ఎరువులను పొలాల్లోకి చేరుస్తున్నారు.

భూసారం పదిలం..

సాధారణంగా రైతులు వేసవిలో పశువుల ఎరువును వ్యవసాయ పొలాలకు తరలిస్తుంటారు. అదే సమయంలో ఎండలు అధికంగా ఉంటాయి. ఈ కారణంగా పశువుల ఎరువును పొలంలో చల్లితే వాటిలో ఉన్న పోషకాలు ఆవిరవుతాయి. అందుకే పశువుల పేడను పొలంలో కుప్పలు పోసుకోవాలి. భూమిలో తగు తేమ ఉన్న సమయంలోనే వెదజల్లి వెంటనే దుక్కిలో కలియదున్నాలి. దీంతో భూసారం పెరుగుతుంది. నేలలోని ఆమ్లత్వం, క్షారత్వం, నీటిని నిల్వ ఉంచే గుణాన్ని అదుపుచేసి పోషకాలు మొక్కలకు అందేలా తోడ్పాటునిస్తుంది.



ట్రాక్టర్‌లో పశువుల ఎరువు నింపుతున్న కూలీలు,ఎడ్లబండిపై పశువుల ఎరువు పొలంలోకి తరలిస్తున్న రైతు



19,600 ఎకరాల్లో సాగు భూమి..

మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలంలోని 26 గ్రామ పంచాయతీల్లో సుమారు ఈ ఏడాది 19,600 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగు చేయనున్నట్లు వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఈ క్రమంలో రైతులు ఆవులు, గేదెలు, గొర్రెలు వంటి పశువుల ఎరువునే తమ పొలాలకు వాడుతున్నారు.

భూసారం పెరుగుతుంది



పశువుల ఎరువుతో భూసారం పెరుగుతుంది. సహజ సిద్ధ పోషకాలు అందుతాయి. నేలలోని నీటిని నిల్వ ఉంచే గుణం అదుపు చేసి పోషకాలను మొక్కలకు అందే విధంగా సాయపడుతుంది. రైతులు పశువుల ఎరువుతో అధిక దిగుబడులు పొందొచ్చు. వీటితో పండించి పంటను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరం.

గుగులోత్ స్వామి నాయక్, ఏఓ, పెద్దవంగర

టీజీ ఎడ్‌సెట్–25 ప్రశాంతం

రెండు సెషన్లలో కలిపి 83.79శాతం హాజరు


టీజీ ఎడ్‌సెట్ సెట్–ఎ ప్రశ్నపత్రాన్ని ఎంపిక చేస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, వీసీ కె.ప్రతాప్‌రెడ్డి తదితరులు

కేయూ క్యాంపస్: రాష్ట్రంలోని బీఈడీ కళాశాలల్లో 2025–26 విద్యాసంవత్సరం ప్రవేశానికి ఆదివారం కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యాన ఆన్‌లైన్ కంప్యూటర్ సిస్టం ద్వారా నిర్వహించిన 'టీజీ ఎడ్‌సెట్' ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంలోని 9 సెంటర్లలో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు మొదటి సెషన్ పరీక్షకు 2,190 మంది విద్యార్థులకు 1,821 మంది(83.15శాతం), మధ్యాహ్నం 2 నుంచి 4 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షకు 2,110 మందికి 1782 మంది(84.45శాతం) హాజరయ్యారు. రెండు సెషన్లు కలిపి 4,300 మంది విద్యార్థులకు 3,603 మంది (83.79శాతం) హాజరైనట్లు టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్, కేయూ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్ రెడ్డి తెలిపారు.

ప్రశ్నపత్రాల సెట్‌ల ఎంపిక

కేయూలోని ఎడ్‌సెట్ కార్యాలయంలో ఉదయం సెషన్ సెట్–ఎ ప్రశ్న పత్రాన్ని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి, రెండో సెషన్ సెట్–బి ప్రశ్న పత్రాన్ని కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డి ఎంపిక చేశారు. ఎంపిక కార్యక్రమంలో కేయూ రిజిస్ట్రార్ వి.రామచంద్రం, రాష్ట్ర ఉన్నత విద్యామండలి వైస్ చైర్మన్లు ఇ.పురుషోత్తమ్, ఆచార్య మొహమ్మద్, సెక్రటరీ శ్రీరామ్ వెంకటేష్, కన్వీనర్ బి.వెంకట్రామ్‌రెడ్డి, విద్యావిభాగం డీన్ రాంనాథ్‌కిషన్, యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ టి.మనోహర్, పాలకమండలి సభ్యులు బి.సురేష్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన చైర్మన్, వీసీ

ఉమ్మడి జిల్లా కేంద్రంలోని మోక్షిత ఇన్‌స్టిట్యూట్, బొల్లికుంట వాగ్దేవి ఇంజనీరింగ్ కాలేజీ, హనుమకొండలోని అయాన్ డిజిటల్, నోబెల్ ఇన్‌స్టిట్యూట్ తదితర పరీక్ష కేంద్రాలను రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి, కేయూ వీసీ ప్రతాప్‌రెడ్డి, రిజిస్ట్రార్ రామచంద్రం, టీజీ ఎడ్‌సెట్ కన్వీనర్ బి.వెంకట్రామ్‌రెడ్డి పరిశీలించారు.

ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- టీఎస్‌ఈఈయూ రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్

హన్మకొండ: విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ (టీఎస్‌ఈఈయూ)–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం హనుమకొండ వడ్డేపల్లి రోడ్డులోని టీఎస్‌ఈఈయూ కార్యాలయంలో ఆర్టిజన్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు.. శ్రీధర్‌ను కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను రెండు రోజుల్లో కలిసి ఆర్టిజన్ కార్మికుల సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరుతానన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే నాలుగు విద్యుత్ కంపెనీలలో ఆర్టిజన్‌లతో కలిసి ధర్నాలు నిర్వహించడానికి కూడా వెనకాడబోమన్నారు. ఐఎన్‌టీయూసీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు తులసి శ్రీమతి, టీఎస్‌ఈఈయూ ఎన్పీడీసీఎల్ యూనిట్ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మచ్చిక బుచ్చయ్య గౌడ్, భువనగిరి సెక్రటరీ ఆర్.సి.రెడ్డి, ఆర్టిజన్ ఉద్యోగుల సంఘం నాయకులు సికిందర్, యుగంధర్, వెంకటేశ్వర్లు, సతీశ్, నరేందర్ రెడ్డి, బాబాన్న, సతీశ్ రెడ్డి , సలీం పాషా, శ్రీనివాసరెడ్డి, రవీందర్, సతీశ్ పాల్గొన్నారు.

ఒంటరితనం భరించలేక వృద్ధుడి ఆత్మహత్య


సారంగపాణి (ఫైల్)

సంగెం: ఒంటరితనం భరించలేక ఓ వృద్ధుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సంగెంలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బొల్లపెల్లి సుశీల, సారంగపాణి(70) దంపతులకు శారద, కుమారస్వామి, రాజు సంతానం. చిన్నతనంలో కుమారుడు కుమారస్వామి చనిపోయాడు. తర్వాత భార్య సుశీల మరణించింది. అనంతరం రేణుకను మరో పెళ్లి చేసుకున్నాడు. కూతురు శారద, చిన్న కుమారుడు రాజు వివాహాలు జరిపించారు. కొంతకాలం తర్వాత కూతురు శారద మరణించింది. ఈ క్రమంలో ఐదేళ్ల క్రితం రెండో భార్య రేణుక సారంగపాణిని వదిలివెళ్లింది. దీంతో కొంత కాలంగా సారంగపాణి చనిపోయిన భార్య సుశీల, కుమారుడు కుమారస్వామి, కూతురు శారదను తలుచుకుంటూ ఒంటరితనంతో మనస్తాపం చెందుతున్నారు. శనివారం రాత్రి భోజనం చేసిన తర్వాత రాజు కుటుంబసభ్యులు ఒకగదిలో సారంగాపాణి మరోగదిలో నిద్రించారు. ఉదయం లేచిన తర్వాత మనవడు వినయ్.. సారంగపాణి గదిలో చూడగా దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడి కనిపించాడు. మృతుడి కుమారుడు రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ పేర్కొన్నారు.

పెళ్లి కావడం లేదని మనస్తాపంతోయువకుడు ..

ఎల్కతుర్తి: పెళ్లి కావడం లేదనే మనస్తాపంతో గడ్డి మందు తాగిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన ఆదివారం ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నెట్టెం సతీశ్(30) పెళ్లి కావడం లేదని కొంతకాలంగా మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో గత నెల 29న కుటుంబీకులకు చెప్పి పొలం వద్దకు వెళ్లాడు. మధ్యాహ్నమైనా ఇంటికి రాకపోవడంతో తల్లి మంజుల ఫోన్ చేయగా పొలం వద్ద గడ్డి మందు తాగానని చెప్పాడు. దీంతో హుటాహుటిన పొలం వద్దకు చేరుకుని సతీశ్‌ను హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీ, కారు ఢీ.. ఇద్దరికి తీవ్ర గాయాలు

జనగామ : జనగామలోని మెడికల్ కళాశాల సమీపంలో కారు, లారీ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. మండలంలోని పెద్దపహాడ్ గ్రామానికి చెందిన షాబీర్, జహంగీర్ పట్టణంలోని గోల్డ్ షాప్‌లో పని చేస్తున్నారు. పనులు ముగించుకొని సొంత కారులో ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో జనగామ వైపు వస్తున్న లారీ ఢీ కొట్టడంతో కారు ఎగిరి పల్టీ కొట్టింది. అందులో ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా 108 లో జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.

కుల బహిష్కరణ చేసిన వారిపై ఫిర్యాదు

సంగెం: కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల కేంద్రానికి చెందిన చెల్కలపల్లి పైడయ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కులానికి చెందిన పెద్ద మనుషులు చెల్కలపల్లి నాగరాజు, నీరటి రమేశ్ తమ కుటుంబంపై కక్ష కట్టి రెండేళ్ల నుంచి కులానికి సంబంధించిన వారిని తమ ఇంటికి రానివ్వడం లేదని, తమ కుటంబాన్ని కులంలోని వారి ఇళ్లకు పిలిస్తే రూ.10 వేలు జరిమానా విధిస్తామని కులకట్టడి చేసినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. మే 30వ తేదీన సంప్రదాయం ప్రకారం.. ముదిరాజ్ కులస్తుల కథలు చెప్పి డబ్బులు తీసుకునే కాటిపడగల వారు తమ గ్రామానికి వచ్చారని, వారికి కులంలోని వారు ఒక్కొక్కరికి రూ.400 చొప్పున ఇవ్వాలని చెరువు వద్ద పెద్ద మనిషి నాగరాజు చెప్పాడని.. అందుకు పైడయ్యతో పాటు ఇద్దరు కొడుకుల డబ్బులు రూ.1,200 ఇవ్వడానికి వెళ్లితే మిమ్మల్ని కులం నుంచి తీసేశామని డబ్బులు తీసుకోమని.. ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని కులపెద్దలు తిరస్కరించారన్నారు. మూడేళ్ల క్రితం చెరువు వద్ద చేపలు పట్టే విషయంలో ఎల్గూరురంగంపేట సొసైటీ కార్యవర్గ సభ్యుల ఎదుట తన కుమారుడు కిరణ్‌పై కత్రలతో దాసి చంపుతామని బెదిరించగా.. అప్పుడు పోలీస్‌స్టేషన్‌లో కేసు పెట్టామని.. అప్పటి నుంచి తమ ఇంట్లో శుభకార్యాలకు వారు రాకుండా, వారిళ్లలోని శుభకార్యాలకు తమను పిలవకుండా అవమానిస్తూ మనోవేదనకు గురి చేస్తున్నారన్నారు. విచారణ చేసి కులకట్టడి చేసిన వారిపై చట్టప్రకారం చర్య తీసుకోవాలని ఫిర్యాదు చేసినట్లు బాధితుడు పైడయ్య తెలిపారు. ఈవిషయంపై ఎస్సై నరేశ్‌ను వివరణ కోరగా.. పిటిషన్ వచ్చిందని విచారణ చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

అధిక సాంద్రత సాగు.. లాభాలు బాగు

- ఎకరాకు 25 నుంచి 30 వేల పత్తి విత్తనాలు నాటొచ్చు
- సాధారణ పద్ధతిలో ఎకరాకు 7 వేలే..
- ఎకరాకు 15– 20 క్వింటాళ్ల దిగుబడి


నాగభూషణం వరంగల్ ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త

దుగ్గొండి: తెల్లబంగారంపై మక్కువతో అన్నదాతలు అనదిగా పత్తి సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో రోజురోజుకూ పెట్టుబడి వ్యయం పెరగడం.. నానాటికీ దిగుబడి తగ్గడం.. దిగుబడికి వచ్చినా సరైన ధర లేక పోవడంతో పత్తి పంటపై అన్నదాతలకు ఆసక్తి తగ్గిపోతుంది. అయితే ఈ తరుణంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగు చేసి అధిక దిగుబడులు సాధించొచ్చని వరంగల్ ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త యు. నాగభూషణం తెలిపారు. రోహిణి కార్తె మొదలు కావడం, రుతుపవనాలు విస్తరించడంతో రైతులు పత్తి పంట సాగు ప్రారంభించారు. మూస పద్ధతికి స్వస్తి పలికి నూతనంగా సాగు చేయాలని ఆయన తెలిపారు. సాధారణంగా రైతులు హచ్చు పద్ధతిలో పత్తి పంట సాగు చేస్తున్నారు. సాలుకు సాలుకు మధ్య 100 సెంటీమీటర్లు, మొక్కమొక్కకు మధ్య 100 సెంటీమీటర్ల దూరంతో విత్తనాలు నాటుతున్నారు. ఇలా సాగు చేయడం వల్ల ఎకరా భూమిలో 6 నుంచి 7 వేల మొక్కలు మాత్రమే వస్తున్నాయి. ఈ పద్ధతిలో సాగుతో పత్తి మూడు దఫాలుగా తీయాల్సి వస్తోంది. కూలీల భారం పెరుగుతుంది. పంట కాలం పెరుగుతుంది. రెండో పంట వేసుకునే అవకాశం రావడం లేదు. దిగుబడి ఏటికి ఏడు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుత పరిస్థితులలో గతేడాది ఎకరాకు 6 క్వింటాళ్లకు మంచి రాలేదు.


అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసిన పత్తి పంట(ఫైల్)

అధిక సాంద్రత పద్ధతిలో ఎకరాకు 30 వేల మొక్కలు..

అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేసే క్రమంలో సాలుకు సాలుకు మధ్య 80 సెంటీమీటర్లు, మొక్కకు మొక్కకు మధ్య 20 సెంటీమీటర్ల దూరంతో విత్తాలి. ఎకరాకు 4 పత్తి గింజల ప్యాకెట్లు అంటే సుమారు 2 కిలోల విత్తనాలు సరిపోతాయి. ఇలా సాగు చేయడం వల్ల ఎకరా భూమిలో 25 నుంచి 30 వేల మొక్కలు వస్తాయి. పత్తి 40 రోజుల వయసులో, 70 రోజుల వయసులో చమత్కార్ మందును పిచికారీ చేయాలి. చమత్కార్ మందు పిచికారి వల్ల చేనంతా ఒకేసారి కాపునకు వస్తుంది. కాయలన్నీ ఒకేసారి కాస్తాయి. దూది సమయంలో కేవలం ఒకసారి మాత్రమే తీసుకోవచ్చు అనంతరం మళ్లీ రెండో పంటగా మొక్కజొన్న, వేరుశనగ, కూరగాయ పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుంది. ఎరువులు వేయడం, సస్యరక్షణ అంతా సాధారణ పద్ధతిలోనే చేసుకోవాలి. ఇలా అధిక సాంద్రత పద్ధతిలో సాగు చేయడం వల్ల 15 నుంచి 20 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మార్కెట్‌లో ధర కొంతమేర తక్కువ ఉన్నా ఆశించిన మేర నికర ఆదాయం ఉండి రైతు లాభాలు పొందుతాడు.


అధిక సాంద్రత పద్ధతిలో పత్తి విత్తనాలు నాటిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు(ఫైల్)

కొనుగోలు కేంద్రంలో ధాన్యం 'మాయం'

- వరుసగా రెండోసారి ఘటన
- పట్టించుకోని కేంద్రం నిర్వాహకులు


వివరాలు వెల్లడిస్తున్న బాధిత రైతులు

చిన్నగూడూరు: రైతులు ఆరుగాలం చెమటోడ్చి కష్టపడి పండించిన ధాన్యం దళారుల పాలవుతుంది. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో వరుసగా రెండోసారి ధాన్యం బస్తాలు మాయమయ్యాయి. బాధిత రైతులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండల కేంద్రానికి చెందిన బాధిత రైతులు నామ సునీతరాజు, కోల లచ్చమ్మ శ్రీను కథనం ప్రకారం.. గత నెల 9న సునీతకు చెందిన 84 బస్తాలు(33 క్వింటాళ్ల 60 కేజీలు), లచ్చమ్మకు చెందిన 38 బస్తాలు(15 క్వింటాళ్ల 20 కేజీలు) మొత్తం 122 బస్తాలు ధాన్యం కాంటా వేవారు. మరుసటి రోజు ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు తరలించారు. వే బ్రిడ్జి కాంటా అయిన మరో పది రోజులకు 110 బస్తాలకు కాంటా అయినట్లు ఫోన్‌కు ఓటీపీ వచ్చిందని మరిపెడ చారి అనే వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో రైతులు ఒక్కసారిగా ఖంగు తిన్నారు. 122 బస్తాలకు 110 బస్తాలు కాంటా అయితే మిగతా 12 బస్తాల ధాన్యం ఏమైందంటూ కొనుగోలు కేంద్రం నిర్వహకులను ప్రశ్నించగా వారు పట్టించుకోలేదు. దీంతో తహసీల్దార్ మహబూబ్‌అలీ, ఎస్సై ప్రవీణ్‌కుమార్‌కు ఫిర్యాదు చేశామని బాధిత రైతులు తెలిపారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఎంచుకోవాలి


పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

- ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి
- గౌడ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేత

కాజీపేట అర్బన్ : విద్యార్థులు సెల్‌ఫోన్లు వీడి, వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు ఎంచుకుని సాధించేందుకు కృషి చేయాలని ఏఐసీసీ ఓబీసీ కోఆర్డినేటర్ కత్తి వెంకటస్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం హంటర్‌రోడ్డులోని గౌడ హాస్టల్‌లో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన గౌడ విద్యార్థులకు గోపా (గౌడ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) ఆధ్వర్యంలో ప్రతిభాపురస్కారాల అందజేశారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గోపా ఆధ్వర్యంలో గౌడ విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డులు నేటి పోటీ ప్రపంచంలో కష్టపడి చదువుతున్న విద్యార్థులను ఉత్తేజపరిచేందుకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో హనుమకొండ, వరంగల్ జిల్లాల గోపా అధ్యక్షులు చిర్రరాజుగౌడ్, లక్ష్మీనారాయణగౌడ్, రాష్ట్ర గోపా మాజీ అధ్యక్షుడు విజయ్‌భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వి.శ్రీనివాస్‌గౌడ్, గౌడ ప్రతిభా పురస్కార్ కార్యక్రమ కన్వీనర్ వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, సీనియర్ నాయకులు పెద్ది వెంకట్‌నారాయణగౌడ్, బూర విద్యాసాగర్‌గౌడ్, తాళ్లపెల్లి జనార్దన్‌గౌడ్, బోనగాని యాదగిరిగౌడ్, ఏసీపీ నాగయ్యగౌడ్, మార్క విజయ్‌గౌడ్, పోగాకు అశోక్ గౌడ్, సురేశ్, కుమారస్వామి, బత్తిని రమేశ్, అంబాల సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనాథ బాలబాలికల జీవితాల్లో వెలుగులు

- బాలవికాస మహిళాభివృద్ధి సీనియర్ మేనేజర్ లత


మాట్లాడుతున్న సీనియర్ మేనేజర్ లత

కాజీపేట రూరల్ : సమాజంలో బాలవికాస సంస్థ అనాథ (వికాస) బాలబాలికల జీవితాల్లో వెలుగులు నింపుతూ వారి అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తోందని ఆ సంస్థ మహిళాభివృద్ధి పథక సీనియర్ మేనేజర్ డి.లత అన్నారు. కాజీపేట ఫాతిమానగర్‌లోని బాలవికాస సంస్థలో ఆదివారం రూ.9 లక్షలతో 273 మంది అనాథ (వికాస) బాల బాలికలకు నూతన విద్యా సంవత్సరానికి 1వ తరగతి నుంచి పీజీ వరకు 9 జిల్లాల వారికి అవసరమైన విద్యాసామగ్రితోపాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలవికాస అనాథ బాలబాలికలకు చేయూతనిస్తూ వారికి అన్ని విధాలా తోడ్పాటునందిస్తూ భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తోందన్నారు. బాలవికాస తెలుగు రాష్ట్రాల్లో మహిళాభివృద్ధి పథకంలో భాగంగా 1,600 మంది అనాథ బాలబాలికలకు చేయూతనిచ్చిందన్నారు. జనవికాస ప్రెసిడెంట్ లూర్దుమర్రెడ్డి మాట్లాడుతూ ప్రతీ మనిషి జీవితంలో విద్య అత్యంత విలువైందన్నారు. బాలవికాస బాలబాలికల విద్యతో పాటు అన్ని రంగాల్లో రాణించేందుకు నిరంతరం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో మహిళాభివృద్ధి పథక నుంచి సుజాత, జ్యోతి, అమూల్య, ఐటీ మేనేజర్ శివరాం, తదితరులు పాల్గొన్నారు.



బొగత వద్ద పర్యాటకుల సందడి

వాజేడు: మండల పరిధి చీకుపల్లి గ్రామ సమీపంలోని బొగత జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. మండలంలో ఇటీవల కురిసిన వర్షాలకు జలపాతం పైనుంచి వరద నీరు జాలువారుతుండడంతో ఆ అందాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆదివారం కావడంతో ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు కావడతోపాటు విద్యార్థులకు వేసవి సెలవులు ముగుస్తుండడంతో సూదూర ప్రాంతాల నుంచి బొగత జలపాతం అందాలను తిలకించి సేదదీరేందుకు భారీగా తరలొచ్చారు.